భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (సోమ)
సహరి : 4:43 (మంగళ)

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల పరిష్కారం

తాడేపల్లిగూడెం ఆర్‌వో కె.చెన్నయ్య



- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
- నియోజకవర్గంలో 2,13,722 మంది ఓటర్లు కాగా, 209 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.
- కోడ్ ఉల్లంఘనపై ప్రజలు ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ నెంబరు 08818 - 229699కు, సీ విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.
- కొత్తగా ఓటు కోసం వచ్చే నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు వుండి, ఓటరు కార్డు లేకపోయినా.. ప్రభుత్వ గుర్తింపు కార్డులు చూపి ఓటు వేయచ్చు.
- ఇంటి నుంచి కదలలేని వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చు. నియోజకవర్గంలో వీరి సంఖ్య 173. వీరిలో 85 ఏళ్ల పైబడిన వారు 78 మంది, దివ్యాంగులు 95 మంది ఉన్నారు.
- ఎన్నికల నియమావళిని అనుసరించి నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వీటిలో అనేక చట్టాలు ఉన్నాయి. వాటిని బట్టి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తాం. వాహనాలకు, మైక్‌లు తదితర వాటికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.
- నిబంధనలను అనుసరించి అభ్యర్థులకు తప్పనిసరిగా సాయపడతాం. దీనికోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశాం. వారికి ఏమైనా సందేహాలు ఉంటే మా వద్దకు వచ్చి నివృత్తి చేసుకోవచ్చు
- తాడేపల్లిగూడెంలో కోడ్ నిబంధనలకు విరుద్ధంగా వున్న మూడు ఫ్లెక్సీలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాం.

- తాడేపల్లిగూడెం అర్బన్

నరసాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా..

వర్మకే చాన్స్



- ట్రిబుల్ ఆర్‌కు రాకపోవడంతో అభిమానుల నిరాశ
- కైకలూరు నుంచి కామినేనికే అవకాశం
- అధికారికంగా నేడో.. రేపో ప్రకటన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తయ్యింది. నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మను ఎంపిక చేసినట్లు పార్టీ అధిష్టానం ఆదివారం ప్రకటించింది. కైకలూరు బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ కామినేని శ్రీనివాసరావు పేరు దాదాపు ఖరారైంది. సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక జనసేన నుంచి పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధికారికంగా ప్రకటించింది. నరసాపురం లోక్‌సభ నుంచి కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ పక్షాన రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేత భూపతిరాజు శ్రీనివాసవర్మ అభ్యర్థిత్వాన్ని ఆదివారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. ఈ స్థానం నుంచి పోటీకి నేతలు వర్మ, పాకా సత్యనారాయణ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. చివరకు సాధారణ కార్యకర్త నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగిన శ్రీనివాసవర్మకు చాన్స్ ఇచ్చారు. సాధారణ కార్యకర్త గుర్తింపు ఇదే నిదర్శనమని, అందరిని కలుపుకుని పోవడం ద్వారా కచ్చితంగా నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందడం ఖాయమని శ్రీనివాసవర్మ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, అమిత్ షా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

రఘురామకు నిరాశ

నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి తాను పొత్తులో భాగంగా ఏ పార్టీ అయినా పోటీ చేయడం ఖాయమని సిట్టింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు విశ్వాసంతో ఉన్నారు. ఆయన పోటీ ఖాయమని కొందరు పందేలకు సైతం దిగారు. చివరి వరకు ఢిల్లీ బీజేపీ పెద్దలు రఘురామ వైపే ఉంటారని అందరూ భావించారు. దీనికి విరుద్ధంగా ఆయనకు పార్టీ పరంగా పోటీ చేసే అవకాశం చేజారింది. నరసాపురం పోటీకి తనకు అవకాశం రాకుండా సీఎం జగన్ అడ్డుపడ్డారని చెప్పారు. టిక్కెట్ రాకపోవడంతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఆది నుంచి సీఎం జగన్ అవినీతిపైన, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపైన దండెత్తిన ఆయనకు అటు బీజేపీ గాని, ఇతర పార్టీలు గాని అవకాశం లేకుండా చేయడం దారుణమని అంటున్నారు. నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఆయన అభిమానులు సోమవారం నిరసనలు వ్యక్తం చేసే అవకాశం లేకపోలేదు.

కైకలూరుకు కామినేని !

టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులో భాగంగా కమలం పార్టీకి నరసాపురం పార్లమెంట్, కైకలూరు స్థానాలను కేటాయించారు. కైకలూరులో రాజకీయ అనుభవం వున్న మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపించింది. మూడు పార్టీల కూటమి ఏర్పడినప్పటి నుంచి డాక్టర్ కామినేని పేరు కైకలూరులో ఫిక్స్ అయినట్లేనని అంతా భావించారు. తాజా సమాచారం మేరకు కామినేని అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేశారు. ఒక దశలో ఏలూరు లోక్‌సభ స్థానం బీజేపీ పక్షాన ఆశించిన తపనా చౌదరిని ప్రత్యామ్నాయంగా కైకలూరు అసెంబ్లీ స్థానానికి వెళతారా అని పార్టీ పెద్దలు కోరారు. అయితే తాను ఎంపీ స్థానంలో మాత్రమే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. కాని, టీడీపీ ఏలూరు లోక్‌సభ అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు.

జనసేన అభ్యర్థులు వీరే..

పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రి అధికారికంగా విడుదల చేసింది. ఇప్పటికే ఆయా అభ్యర్థులను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పిలిచి ఎన్నికల నియమావళిని అందజేసి ప్రచారం చేసుకోవాలని పవన్ ఆదేశించారు. తాజాగా ఉంగుటూరు అసెంబ్లీ స్థానం నుంచి పత్సమట్ల ధర్మరాజు, పోలవరం నుంచి చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాసు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీ చేస్తున్నట్లు జాబితా ప్రకటించారు. వీరంతా ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ఉమ్మడి కూటమి అభ్యర్థులుగా ప్రచారంలో తలమునకలై ఉన్నారు. పార్టీ సైతం ఇక అధికారికంగా ప్రకటించడంతో ఉన్న చిక్కులన్ని వీడినట్లు అయ్యింది. ఓ వైపు బీజేపీ మరోవైపు టీడీపీ, జనసేన తమకు కేటాయించిన స్థానాల్లో అభ్యర్థుల జాబితాను పూర్తిగా ప్రకటించింది.

26, 27 తేదీలలో భువనేశ్వరి పర్యటన

- చంద్రబాబు అక్రమ అరెస్టుతో ప్రాణాలు వదలిన కుటుంబాలకు పరామర్శ

ఏలూరు/జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 26, 27 తేదీలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన సమయంలో ఆయన వీరాభిమానులు కొందరు మనోవేదనకు గురై అకాల మరణం చెందారు. వీరిలో జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన భీమడోలు వెంకన్న, కొయ్యలగూడెం మండలం యర్రంపేట, కన్నాయిగూడెం, బయ్యన్నగూడెం గ్రామాల్లో చంద్ర చిన్న కన్నయ్య, డి.వెంకటలక్ష్మి మార్గాని వెంకటేశ్వరరావు ఉన్నారు. వీరి కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పేందుకు 'నిజం గెలవాలి' పేరిట భువనేశ్వరి రానున్నారు. పోలవరంతోపాటు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గాల్లోనూ బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శించనున్నారు. ఈ మేరకు పార్టీ ఏర్పాట్లు చేయనున్నట్లు ఆదివారం ఏలూరులో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ జోన్ 2 ఇన్‌చార్జి మందలపు రవి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీష్‌బాబు ప్రకటించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గన్ని


మహేష్‌కుమార్‌ను ఆశీర్వదించండి

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన మహేష్ కుమార్‌యాదవ్‌ను పార్టీ ప్రకటించినందున ఆయనను ఆశీర్వదించాల్సిందిగా టీడీపీ నేతలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మహేష్ అప్పనవీడు ఆంజనేయస్వామికి పూజాదికాలు పూర్తి చేసి, ఉదయం పది గంటలకు టీడీపీ ఏలూరు జిల్లా కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని కార్యకర్తలు, నేతలు వివిధ వర్గాల వారిని పరిచయం చేసుకుంటారు. అందరూ మహేష్‌ను కలిసేందుకు వీలుగా ఈ షెడ్యూలు ప్రకటించారు.

కాంగ్రెస్‌లోకి వైసీపీ ఎమ్మెల్యే ఎలీజా



చింతలపూడి, మార్చి 24 : చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఎలీజాకు కాంగ్రెస్ కండువా కప్పారు. వైసీపీలో తనకు జరిగిన అవమానాల నేపథ్యంలో పార్టీ మారుతు న్నానని, ఎలీజా చెప్పారు. తాను చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు.


హంస వాహనంపై అమ్మవారి తెప్పోత్సవ దృశ్యం

వైభవంగా పెద్దింటమ్మ తెప్పోత్సవం

కైకలూరు, మార్చి 24: కొల్లేటికోట పెద్దింటమ్మ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి తెప్పోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి కోనేరులో హంస వాహనంపై నిర్వహించిన తెప్పోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కోనేరు చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ ఆకట్టుకుంది. ఉదయం నుంచి భక్తులు వేలాదిమంది తరలిరావడంతో అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు దీరారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని కొల్లపర్రుకు చెందిన కనుమూరి రంగరాజు, నాగపార్వతీ దంపతులు అందజేశారు. మహిళలు చలువపందిళ్లల్లో పాలపొంగళ్లను పొంగించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కొంతమంది భక్తులు కోళ్లను, పొట్టేల్లును మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

వత్తాసు పలికితే వేటు

వైసీపీ నాయకులతో పెంటపాడు ఎస్‌ఐ కవాతు

టీడీపీ నాయకుల ఫిర్యాదు.. వీఆర్‌కు ఎస్‌ఐ

నరసాపురంలో ముగ్గురు వలంటీర్ల సస్పెన్షన్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



అధికార వైసీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్న అధికారులపై వేటు పడుతోంది. రాజకీయ పక్షాలతో అంటకాగితే చర్యలు తప్ప వంటూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ హెచ్చరించారు. అయినా కొందరు అధికారులు బరితెగిస్తున్నారు. ఎన్నికల శాంతి భద్రతలు అదుపులో ఉండేలా నిర్వహించిన పోలీస్ కవాతులో పెంటపాడు ఎస్‌ఐ అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించారు. కవాతు సమయంలోనే వారితో ఫోటోలు దిగారు. స్థానిక అధికార పార్టీ ఎంపిటిసిని కవాతు ముందుండి నడిపంచారు. అంటే పోలీస్ సైతం అధికార పరక్షానికి అనుకూలంగా ఉందన్న సంకేతలు పంపారు. ఇదే విషయమై తెలుగుదేశం నాయకులు జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పెంటపాడు ఎస్‌ఐని వీఆర్‌కు పంపారు. అలాగే ఇప్పటికీ కొందరు అధికారులు అధికార పార్టీకి అండగా ఉంటున్నారు. వాలంటీర్ల సేవలను వినియోగించుకుంటున్నారు. ఇంకా వాలంటీర్లు మనుగడలో ఉన్నారన్న సంకేతాలు ప్రజల్లోకి పంపుతున్నారు. సకాలంలో పన్నులు చెల్లించాలంటూ వాలంటీర్లు ఇప్పటికీ తాడేపల్లిగూడెంలో తమ క్లస్టర్ పరిధిలో ఉన్న నివాసితులకు మొబైల్‌లో మెసేజ్‌లు పంపుతున్నారు. అంటే వాలంటీర్లు విధుల్లో ఉన్నట్టు సంకేతాలు పంపుతున్నారు. దీనివల్ల వైసీపీకి అధికారులు అండగా ఉంటున్నారన్న సంకేతాలు వెళుతున్నాయి. నర్సాపురంలో ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వాలంటీర్లను విధులనుంచి తొలగించారు. ఆచంట నియోజకవర్గంలో వైసీపీ సోషల్ మీడియా సమన్వయకర్త ఏకంగా వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో కొందరు వాలంటీర్లు వలంటీర్లు ఇంకా ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొంటున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగులే ప్రభుత్వంపై కృతజ్ఞత చూపాలంటూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వద్దకు వెళ్లి సూచించాలని వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ఆ మేరకు గ్రామాల్లో, పట్టణాల్లోనూ పలువురు వాలంటీర్లు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఇప్పటికే ఉండిలో తొమ్మిది వాలంటీర్లను తొలగించారు.

తాడేపల్లిగూడెంలో ఓ మున్సిపల్ అధికారి అధికార పార్టీ అండతో అవినీతికి పాల్పడుతున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లింది. తెలుగుదేశం నాయకులు పక్కా సమాచారంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో సదరు అధికారికి బదిలీ చేయాలని అప్పటి కలెక్టర్ ప్రయత్నాలు చేశారు. తాడేపల్లిగూడెంలో ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించడంలో విఫలమవుతున్నారంటూ ప్రస్తుత కలెక్టర్ సంబంధిత మున్సిపల్ అధికారికి చీవాట్లు పెట్టినట్టు సమాచారం. మొత్తంపైన అధికార పార్టీకి అంటకాగుతున్న ఉద్యోగుల సమాచారాన్ని ఎన్నికల అధికారులు రాబడుతున్నారు. వేటు వేస్తున్నారు.

ఉద్యోగులు, వలంటీర్లకు కలెక్టర్ హెచ్చరిక



భీమవరం, మార్చి 24 : 'రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనకూడదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి పాల్గొంటే చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగిస్తున్నాం' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. 'వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అప్పటి నుంచి అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తున్నాం. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేసి సిద్ధంగా పెట్టుకున్నాం. గత ఎన్నికల్లో తక్కువగా పోలింగ్ శాతం నమోదైన 10 పోలింగ్ స్టేషన్లను గుర్తించాం. అక్కడ పోలింగ్ శాతం ఎలా పెంచాలనే దానిపై ప్రణాళిక రూపొందించాం' అని వివరించారు.

చెక్ పోస్టుల్లో విస్తృత తనిఖీలు

- ఉమ్మడి పశ్చిమలో 13 చోట్ల ఏర్పాటు
- రూ.50 వేలు మించి రవాణా చేస్తే లెక్కలు చూపాల్సిందే.. లేకుంటే సీజ్
- పన్నులు చెల్లించకపోయినా తప్పని తిప్పలు


కామవరపుకోట మండలం కొత్తూరు వద్ద వాహనాలను తనిఖీ


పెనుమంట్ర మండలంలో వాహనాల తనిఖీ

భీమవరం క్రైం, మార్చి 24 : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉమ్మడి పశ్చిమ వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సరిహద్దులైన యలమంచిలి మండలం చించినాడ, పెనుగొండ మండలం సిద్ధాంతం, తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం, భీమవరం మండలం లోసరి, ఆకివీడు మండలం దుంపగడప వద్ద, ఏలూరు జిల్లాలో తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు గ్రామాలైన చింతలపూడి మండలం అల్లిపల్లి, గురుభట్లగూడెం, టి.నరసాపురం మండలం లంకాలపల్లి, జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం, వేలేరుపాడు మండలం మేడేపల్లి, కుక్కునూరు మండలం శ్రీధర వేలేరు, చాట్రాయి మండలం పర్వతపురం, కృష్ణారావు పాలెం వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఏర్పాటు చేసిన సిబ్బంది ఇక్కడ 24 గంటలు గస్తీ నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత నగదు, బంగారం రవాణాపై ఆంక్షలు విధించారు. రూ.50 వేలు మించి రవాణా చేయకూడదు. ఒకవేళ దీనికి మించిన సొమ్ము తీసుకు వెళుతూ తనిఖీల్లో బయటపడితే వాటిని స్వాధీనం చేసుకుం టారు. ఆ డబ్బు ఎవరి దగ్గర అయినా అప్పు తీసుకున్నారా, బ్యాంక్‌లో డ్రా చేశారా, వ్యాపారంలో వచ్చిన నగదా అనే విషయాలను బిల్లులు రూపంలో చూపించాలి. లేని పక్షంలో రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో ట్రెజరీ కార్యాలయంలో జమ చేస్తారు. ఒకవేళ ఆ సొమ్ములకు సరైన పన్ను చెల్లించకపోయినా సంబంధిత అధికారులకు పట్టుకున్న అధికారులు లెటర్ ద్వారా తెలియపరుస్తారు. వారం క్రితం భీమవరం మండలం లోసరి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి కారులో రూ.10 లక్షలు తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును ట్రెజరీ కార్యాలయానికి అప్పగించారు. సరైన ఆధారాలు చూపించి నగదు తీసుకుని వెళ్లాలని ఆ వ్యక్తికి స్పష్టం చేశారు. లోసరి చెక్ పోస్టు వద్ద ఎన్నికల కోడ్ రాక ముందే ఇద్దరు వ్యక్తులు విదేశీ మద్యం తరలిస్తూ పట్టుకున్నారు. ఈ నెల 19న ఒక వ్యక్తి ఐదు ఫుల్ మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. ఇలా పోలీసు తనిఖీల్లో నిత్యం ఎవరో ఒకరు పట్టుబడుతూనే ఉన్నారు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, పౌరులకు సంబంధించిన ప్రతి వాహనాన్ని, ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఎవరికీ మినహాయింపు లేదు. ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.19.25 లక్షల నగదు సీజ్ చేశారు. మరోవైపు వాహనాలు తనిఖీతో పాటు అనుమానిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటున్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వారిపై నిఘా పెట్టారు. చెక్ పోస్టులలో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లా కమాండ్ కంట్రోల్ రూం నుంచి మానిటర్ చేస్తున్నారు.

భానుడి భగభగలు మొదలు

- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- బయటకు రావడానికి భయపడుతున్న ప్రజలు

ఆకివీడు, మార్చి 24 : సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజానీకం విలవిలలాడుతున్నారు. బయటకు రావాలంటే భయపడుతున్నారు. ప్రధాన రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. ఉదయం 11 గంటల తరువాత ప్రజలు, వాహనదారులు అంతగా రోడ్లపై కనిపించకపోవడంతో రోడ్లన్ని నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోవడం, వేడి విపరీతంగా పెరిగిపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మెయిన్‌సెంటర్‌లో ఆదివారం ఎండ తీవ్రతకు రోడ్లపై ఎవరూ కనిపించడం లేదు. బేరాలు లేకపోవడంతో వ్యాపారస్థులు ఎండకు భయపడి మధ్యాహ్నం సమయంలో దుకాణాలు మూసివేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలంటే ఎండ తగలకుండా తగు జాగ్రత్తలతో బయటకు వచ్చి పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత జనం బయటకొస్తున్నారు.


బయటకు వస్తే గొడుగు వేయాల్సిందే


నిర్మాణుష్యంగా వున్న ఆకివీడు మెయిన్ రోడ్

రొయ్యకు.. గడ్డుకాలం!



- ధర పతనం..100 కౌంటు ధర రూ.210
- పెట్టుబడులూ రాక రైతుల ఆవేదన

గిట్టుబాటు ధర కల్పించాలి : ఎం.సుబ్బరాజు



రొయ్యలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు కూడా రాక నష్టాల బారిన పడుతున్నాం. చెరువుల లీజు ధరలు, విద్యుత్ ఛార్జీలు, మేత ధరలు విపరీతంగా పెరిగాయి. అందుకు తగ్గట్టుగా రొయ్యల ధరలు పెరగక పోగా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన 100 కౌంటు రూ.240కి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

కలిదిండి, మార్చి 24 : రొయ్యల ధరలు పతనమవ్వడంతో పెట్టుబడులు రాక ఆక్వా రైతులు నష్టాల పాలవుతున్నారు. 100 కౌంటు ధర రూ.210కి పడిపోవడంతో రొయ్య సీడ్ సొమ్ములు కూడా రావడం లేదని వాపోతున్నారు. వేసవిలో వనామి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు లక్షా యాభై వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. శీతాకాలంలో రొయ్యలకు వైరస్ సోకి మృత్యువాత పడడంతో తీవ్రంగా నష్టపోయారు. వేసవి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. చెరువుల్లో రొయ్యలు 100 కౌంటుకు రాగానే రొయ్యకు వైట్ గట్ వైరస్ సోకడంతో వేలాది చెరువుల్లో రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రైతులు హడావుడిగా పట్టుబడులు చేయడంతో పెద్ద ఎత్తున మార్కెట్‌కు రొయ్యలు రావడంతో దళారులు సిండికేటుగా దోచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం 100 కౌంటు ధర రూ.210 ఉండగా, రూ.20 తక్కువకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. రొయ్యలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలు లేక రొయ్యలను అయినకాడికి అమ్ముకుని గిట్టు బాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. 100 కౌంటు రొయ్యలను రూ.240కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఆ దిశగా ప్రభుత్వ ఆదేశాలను రొయ్యల వ్యాపారులు అమలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఫిషరీష్ ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ '100 కౌంట్ రొయ్యలను రూ.240కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఆ దిశగా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. 100 కౌంటు రొయ్యలను రూ.210 కొనుగోలు చేస్తే రైతులు టోల్ ఫ్రీ నెంబరు 155251 కాల్ చేయాలి. రొయ్యలకు గిట్టుబాటు ధర అమలుపై మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారికి నివేదిక సమర్పిస్తాం' అని తెలిపారు.

నాణ్యమైన సీడ్ అందించాలి : ఎస్.భగవాన్లు



హేచరీలో నాసిరకం సీడ్‌ను సప్లయి చేయడంతో చెరువుల్లో వేసిన నెలకే వైరస్ సోకి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. పీసీఆర్ పరీక్షలు కూడా చేయకుండానే నేరుగా సీడ్‌ను విక్రయిస్తున్నారు. నాణ్యమైన రొయ్యల సీడ్‌ను విక్రయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

పాండిచ్చేరి వరకు సర్కార్ ఎక్స్‌ప్రెస్

వారానికి మూడు రోజులు



నరసాపురం, మార్చి 24: తణుకు, భీమవరం, ఆకివీడు మీదుగా నడిచే కాకినాడ-చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్ పాండిచ్చేరి వరకు పొడి గించారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. ఆది కూడా ఆది, బుధ, గురువారాల్లో, తిరుగు ప్రయాణాల్లో సోమ, గురు, శుక్రవారాల్లో పాండిచ్చేరి నుంచి కాకినాడ వరకు నడుస్తోంది. ఇక మిగిలిన నాలుగు రోజులు యాధావిధిగా కాకినాడ పోర్టు నుంచి చెంగల్‌పట్టు వరకు నడుస్తోంది. ఈ రైలు 1967లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఆత్తిలి, తణుకు, భీమవరం, ఆకివీడు మీదుగానే చెన్నై వెళుతుంది. చెన్నై వెళ్లే ప్రయాణికులు ఈ రైలులో వెళ్లేందుకే ఇష్టపడుతుంటారు. కొంతకాలం నుంచి ఈ రైలును పాండిచ్చేరి వరకు పొడిగించాలని ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన చాలామంది పాండిచ్చేరిలో నివాసం ఉంటున్నారు. వీరు అక్కడ నుంచి రావాలంటే చెన్నై సెంట్రల్, లేదా చెంగల్ పట్టుకు రావాల్సి వస్తున్నది. సదరన్ సెంట్రల్ రైల్వే ఈరైలును పొడి గించేందుకు అనుమతి నివ్వలేదు. దీంతో ఏళ్ళ తరబడి ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. ఈ తరుణంలో నరసాపురం నుంచి నేరుగా పాండిచ్చేరికి వారంలో ఒక్క రోజు వీక్లి ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు ప్రతిపాదన పెట్టింది. దీనికి కూడా అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పొడి గించమని విజయవాడ డివిజన్ అధికారులు విజ్ఞప్తి చేశారు. దానికి సదరన్ రైల్వే పచ్చజెండా ఊపింది.ఈ ఏడాది జూలై వరకు ఈ రైలును వారానికి మూడు రోజులు నడప నున్నారు. ఆ తరువాత వారంలో అన్ని రోజులు నడుస్తోంది. ప్రస్తుం ఈరైలు పాండిచ్చేరికి ఉదయం 9.50గంటలకు చేరుకుంటుంది. తిరిగి పాండిచ్చేరిలో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం భీమవరం 4.40, తణుకు 5.13కి వస్తుంది.



ద్వారకా తిరుమల సంకల్పయాత్రలో మద్దిపాటి

అరాచక పాలన అంతమవ్వాలి

గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి

ద్వారకా తిరుమల సన్నిధిలో ముగిసిన సంకల్పయాత్ర

ద్వారకాతిరుమల, మార్చి 24: అరాచక, సైకో పాలనను అంతమొందించి సుపరి పాలన ఇచ్చేందుకు చేస్తున్న పోరాటానికి దేవుని ఆశీస్సులు కోరుతున్నానని గోపాల పురం నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దైవసన్నిధి నుంచి దేవస్థానం వరకూ పేరిట ఆయన తలపెట్టిన సంకల్ప యాత్ర నాల్గవ రోజు ఆదివానం శ్రీవారి పాదాల చెంతకు చేరుకోవడంతో ముగిసింది. రాజుపాలెంలో సర్పంచ్ దేవరపల్లి నర్సమాదేవి రాయుడుబాబు ఘనస్వాగతం పలికారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర పలుగ్రామాల మీదుగా ఆదివారం సాయంత్రం ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకుంది. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కోడిగూడెం మాజీ సర్పంచ్ తాండ్ర రాంబాబు టీడీపీలో చేరగా మద్దిపాటి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు లంకా సత్యనా రాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వరరావు

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉమా మహేశ్వరరావు

భీమవరం క్రైం, మార్చి 24 : క్షయ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమా మహేశ్వర రావు కోరారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం భీమవరం ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహేశ్వర రావు మాట్లాడుతూ క్షయ(టీబీ) ఒక అంటు వ్యాధి అని ముందస్తు జాగ్రత్తలతో అడ్డుకట్ట వెయ్యవచ్చున్నారు. వ్యాధి సోకిన వ్యక్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా ఉమ్మి వేసినప్పుడు టీబీ బ్యాక్టీరియా గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. టీబీ వ్యాధి ఆరు నుంచి 12 నెలల వరకు యాంటీ బాక్టీరియల్ మందుల కలయికతో నివారించదగినదిదన్నారు. టీబీ వ్యాధి ప్రాణాంతక వ్యాధి అని తొలి దశలో గుర్తించి మందులు వాడితే టీబీని తరిమికొట్టవచ్చునన్నారు. జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ భానునాయక్ మాట్లాడుతూ జిల్లాలో 1690 కేసులు గుర్తించి క్రమం తప్పకుండా ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ పథకం కింద ప్రతీ రోగికి నెలకు రూ.500 ఇస్తారని దాతల సహకారంతో పౌష్టికాహారం కిట్లు అందిస్తున్నామన్నారు.క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమాలలో విస్తృత సేవలందించిన 20 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించారు.రోగులకు దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లును అందించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవికళ్యాణి, వైద్యాధికారులు రంగారావు, గోవిందబాబు, రాంబాబు, యాపిల్ ఆర్గనైజేషన్ కముజు శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దబ్బుతో కొడదాం!





అవినీతి మరకలను చెరిపేద్దాం

ఓటర్లను మభ్యపెట్టొచ్చన్న ధీమా

అధికార పార్టీ నాయకుల ఉత్సాహం

పార్టీ కేడర్‌ను పట్టించుకోని నేతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని వాణిజ్య కేంద్రమైన పట్టణంలో అధికార పార్టీ నేత బూత్ స్థాయి ఇన్‌చార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందరికీ సమా చారం అందించారు. ఇన్‌చార్జ్‌ల నుంచి స్పందన లేదు. దాంతో సమావేశం వాయిదా వేసుకున్నారు. అదే నియోజకవర్గంలో 35 వేల మెజారిటీతో కూటమి విజయం సాధిస్తుందంటూ అధికార పార్టీ అధిష్ఠానానికి సర్వే బృందం నివేదిక ఇచ్చింది. వాస్తవానికి సదరు నేతకు టిక్కెట్ ఇవ్వకూడదంటూ అధిష్ఠానం నిర్ణయించింది. చివరకు అధికార పార్టీ నేత సోదరుడు రంగంలోకి దిగారు. సీటు గెలిచి చేతిలో పెడతామంటూ జగన్‌కు మాటిచ్చారు. డబ్బులు ఖర్చు పెట్టయినా నెగ్గుకు వస్తామంటూ అధినేత వద్ద పట్టుబట్టి టిక్కెట్ తెప్పించుకున్నారు. ఇలా పార్టీ కేడర్‌లోనూ ప్రజల్లోనూ ఆదరణ కంటే డబ్బుతోనే నెగ్గు కొస్తామనే ధీమాలో జిల్లాలోని అధికార పార్టీ నేతలు ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేడర్‌ను పట్టించుకోలేదు. వారి బాగోగులను చూసుకోలేదు. పార్టీ శ్రేణులు ఆర్థికంగా నష్టపోయాయి. స్థానిక సంస్థల్లో వైసీపీ కోసం లక్షలు వెచ్చించి గెలిచిన నాయకులంతా అప్పుల పాలయ్యారు. వారిని గట్టెక్కిద్దామన్న పరిస్థితులు అటు పార్టీలోనూ,ఇటు నియోజకవర్గ నాయకత్వంలోనూ లేకుండా పోయింది. మరోవైపు అవినీతి, అక్రమాలతో నియోజకవర్గ నేతలు కోట్లు గడించారు. కేడర్‌ను విస్మరించారు. ఇప్పుడదే అధికార పార్టీని వెంటాడుతోంది. నాయకులంతా పార్టీని వీడుతున్నారు. పార్టీని నెగ్గించడంలో కీలకంగా వ్యవ హరించిన వారంతా ఇప్పుడు దూరంగా ఉంటున్నారు. కేవలం డబ్బుతోనే ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్న తలంపుతో అధికార పార్టీ అభ్యర్థులు న్నారు. కూటమి అభ్యర్థుల ఢీకొట్టేందుకు డబ్బు ఒక్కటే ప్రధాన వనరుగా చూసుకుంటున్నారు.

భవనాలకు సొమ్ములు తీసుకుంటారా ?

తాడేపల్లిగూడెంలో భవనాలు నిర్మిస్తే అధికార పార్టీ నేత సొమ్ములు తీసు కుంటారట కదా అంటూ ఓ మహిళ వ్యాఖ్యానించింది. ఇప్పుడిదే పట్టణంలో గొడవగా ఉందంటూ చెప్పుకొచ్చింది. అంటే తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ అవినీతి దందా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. భవన నిర్మాణాలు చేప ట్టిన ప్రతి యజమాని నుంచి సొమ్ములు వసూలు చేశారు. టీడీఆర్ బాండ్‌ల జారీలోనూ పెద్ద మొత్తంలో అవినీతి జరిగింది. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల్లోనూ అక్రమార్జన చేశారు. ఇప్పుడదే అధికార పార్టీకి నీడలా వెంటాడుతోంది. కేవలం డబ్బు అధికంగా ఇచ్చి నెట్టుకు రావాలన్న తలంపుతో పార్టీ ఉంది. ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలంతా దూరమయ్యారు.చివరి దశలో అధికార పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఇక్కడ కూడా దూరమైన కేడర్

తణుకు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతకు కుడి, ఎడమలుగా ఉన్న నాయకులంతా రాజీనామా బాటపట్టారు. తణుకులోనూ అవినీతి దందా నిర్వహించడంలో అధికార పార్టీ నేత తక్కువేమీ కాదు. టీడీఆర్ బాండ్‌ల కుంభకోణం అధికార పార్టీ మెడకు చుట్టుకుంది. భవన నిర్మాణాల్లోనూ కమీషన్‌లు ఇచ్చే పరిస్థితి నెలకొంది. అక్కడ కూడా పార్టీ కోసం పాటుపడ్డ వారిని పక్కన పెట్టేశారు. సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. దాంతో విసిగిపోయిన ముఖ్య నాయకులంతా పార్టీకి దూరంగా ఉంటున్నారు. కొందరు రాజీనామాలు చేసేశారు. ఇక ఆచంట నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాతో అధికార పార్టీ నాయకులు దందా సాగించారు. కోట్లు కొల్లగొట్టారు. జగనన్న కాలనీల్లో భూసేకరణ విషయంలోనూ పెద్ద మొత్తంలో చేతులు మారాయి. ఇదే విషయమై ఎంపీ రఘురామకృష్ణంరాజు తొలుత లేవనెత్తారు. మొత్తంపైన ఇసుక దందాలో కొందరు అధికార పార్టీ సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించారు. ఇలా అతికొద్ది మందికే అక్కడ లబ్ధి చేకూరింది. పార్టీలో ఒక బలమైన సామాజిక వర్గానికి కూడా ఏమీ చేయలేదనన్న అసంతృప్తి ఆచంటలో నెలకొంది. ఇలా కొన్ని వర్గాలు, కేడర్ పార్టీకి దూరంగా ఉంటోంది. నర్సాపురంలోనూ అధికార పార్టీ నేత బినామీ ఆస్తులు కూడ గట్టుకున్నారన్న విమర్శలు తారస్థాయికి చేరిపోయాయి. భీమవరంలో మట్టి దందాతో పాటు, లేఅవుట్‌లలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న వాదన బలంగా ఉంది. అధికార పార్టీ నేతను ఇదే వెంటాడుతోంది. ఇలా అధికార పార్టీ నేతలపై అవినీతి మరక అంటుకుంది. వారంతా ఇప్పుడు డబ్బులతోనే ఓటర్లను మభ్యపెట్టవచ్చనే భ్రమలో ఉన్నారు.



గుమ్మంపాడులో సుమన్‌ను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

అన్నమయ్య చిత్రం నా జీవితాన్ని మలుపు తిప్పింది : నటుడు సుమన్

అత్తిలి, మార్చి 24 : అన్నమయ్య చిత్రంలో నటించిన వేంకటేశ్వర స్వామి పాత్ర తన జీవితంలో పెద్ద మలుపు అని సినీ నటుడు సుమన్ అన్నారు. అత్తిలి మండలం గుమ్మంపాడు శ్రీహరి ప్రహ్లాదపురంలో గల సుబ్రహ్మణ్యేశ్వర గోమహాలక్ష్మి సమేత నారికేళ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు ధర్మం ప్రకారం గుడికి వస్తామని తద్వారా మనలోని ఆధ్యాత్మిక భావాలూ పెంపొందించుకోవాలన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను చెన్నైలో ఒక మెకానిక్ సహకారంతో నటుడిని కాగలిగానన్నారు. వివిధ భాషలలో 800 పైగా సినిమాల్లో నటించానన్నారు. శ్రీరామదాసు చిత్రంలో నటించడం ద్వారా అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి వెళ్లగలిగినట్లు చెప్పారు. సుమన్‌ను ఆలయ కమిటీ తరఫున పూలవర్తి రవీంద్రఫణి గోపాల్, శ్రీహరి గోపాల్ సత్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గిరిజ పూర్ణిమ, యర్రమిల్లి విశ్వనాథం, జోగి రామచంద్రమూర్తి చంద్రశేఖర శాస్త్రి, సర్పంచ్ వేగేశ్న సత్యనారాయణరాజు, విశ్వభారతి పాల్గొన్నారు.



ఆహా ఏమి హాయి..!

చినవెంకన్న ఆలయం వద్ద అధునాతన టెంట్ల ఏర్పాటు

ద్వారకాతిరుమల, మార్చి 24 : చిన్నతిరుమలేశుని దర్శనానికి క్షేత్రానికి వచ్చిన భక్తులు భానుడి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయ అధికారులు పలు సౌకర్యాలను కల్పించారు. ఆలయ పరిసరాల్లో నడిచే భక్తులకు ఎండవేడిమి పాదాలకు తగలకుండా మ్యాట్‌లను ఏర్పాటు చేశారు. ఆలయ అనివేటి మండపం పక్కనున్న షాపింగ్ కాంప్లెక్స్, కేశ ఖండన శాల ముందు అధునాతన టెంట్‌లను ఏర్పాటు చేశారు. ఆదివారం భక్తులతో సెలవు రోజు కావడంతో పాటు పెళ్లిళ్ల జరుగుతుండటంతో ఉదయం నుంచే ఆలయంలో రద్దీ నెలకొంది. దాదాపు 15 వేలమందికి పైబడి భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండలో తిరిగి ఇక్కడకు చేరుకున్న భక్తులు ఏర్పాటు చేసిన టెంట్లలో కాసేపు సేదతీరుతున్నారు.



భక్తులతో కిటకిటలాడిన క్షేత్రం

యాగాలు, యజ్ఞాలు త్యాగానికి ప్రతీక

గరికపాటి నరసింహారావు



పాలకొల్లు అర్బన్, మార్చి 24 : గతకాలంలో యాగాలు, యజ్ఞాలు చేసే వారని, అవి త్యాగానికి ప్రతీకలుగా నిలుస్తాయని మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆనంద జ్యోతిర్మయం కార్యక్రమంలో నరసింహారావు ముఖ్య వక్తగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నరసింహారావు మాట్లాడుతూ పూర్వ కాలంలో చక్రవర్తి బలంగా ఉండేందుకు రాజసూయ యాగం, అశ్వమేధ యాగం, యజ్ఞాలు చేసేవారన్నారు.వరి చేలలో విత్తనాలు చల్లడంతో మొలకలు పెరుగుతాయని వాటిని రైతు విడదీసి విడివిడిగా నాటడం ద్వారా మళ్ళీ ఆ మొక్కలు పంట పండి రైతుకు మేలు చేస్తుందని, ఆదే మాదిరిగా కుటుంబ యజమాని తన కూతుళ్లను కూడా వేరు వేరు ప్రాంతాల్లోని వారికి ఇచ్చి వివాహం చేసినప్పటికీ వారి సంతానం చూసి తృప్తి చెందుతాడని చమత్కారంగా చెప్పారు. రీజనల్ ఛైర్మపర్సన్ ఫణీంద్రుడు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, కాకరాల వేణుబాబు, గొట్టం మాణిక్యాలరావు, లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మేకా శ్రీరామ్‌సురేష్, డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, (బాబ్జీ), పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, నందుల సీతారామారావు, డాక్టర్ చినమిల్లి సత్య నారాయణ రావు కెవిఆర్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.




వశిష్ట గోదావరికి పంచ హారతులు

పెనుగొండ,మార్చి 24: పెనుగొండ మండలం సిద్దాంతం వశిష్ఠ గోదావరి వద్ద ఆదివారం రాత్రి పాల్గొణ పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచహారతులు నిర్వహించారు. కలగా భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో కంచర్ల జయరామగుప్త, నాగ వెంకటలక్ష్మి దంపతులచే గోదావరి మాతకు హారతి ఇచ్చారు.

మీరు.. మీ బంధువులు ఓటేయాలి

శుభకార్యాల్లో అభ్యర్థుల హడావుడి



నరసాపురం, మార్చి 24: "అమ్మ ఎలా ఉన్నారు... సార్ బాగున్నారా....ఈ సారి మీరు, మీ కుటుంబ సభ్యులంతా నాకే ఓటు వేయాలి.. మీ బంధు వులతోనూ వేయించాలి..ప్రచారానికి త్వరలో మీ ఊరోస్తాం.." వారం రోజుల నుంచి శుభకార్యాల్లో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం ఇది.. ఇంకా నామినేషన్ల ప్రక్రియ మొదలు కాలేదు. అభ్యర్థులు మాత్రం గెలిపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రచారం చేసుకుంటున్నారు.పెళ్ళిళ్ళు, రిసెప్షన్‌లు, గృహప్రవేశాలు, ఇతర కార్యక్రమాలను విడిచి పెట్టడం లేదు. విధిగా హాజరవుతున్నారు. విచ్చేసిన వారందరినీ పలకరిస్తున్నారు. పెళ్లిళ్లలో వీరి హడావుడే కనిపిస్తోంది. ఇన్విటేషన్ అందిందో... లేదో పోటీలో ఉన్న అభ్యర్థులు పోటిపడుతున్నారు.



టీడీపీలో చేరిన బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

ఏలూరు రూరల్, మార్చి 24: బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఆదివారం ఉండవల్లిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఏలూరు జిల్లా నుంచి రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎన్.బి.ఎస్ శర్మ, అర్చక పురోహిత సంఘ గౌరవ అధ్యక్షుడు నరసింహమూర్తి, టీడీపీ బ్రాహ్మణ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రామ్ ప్రసాద్, ఇతర జిల్లాల నుంచి టీడీపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ జనార్ధన్ నేతృత్వంలో చంద్రబాబును కలిసి పార్టీలో చేరారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



మర గానుగలకు విద్యుత్ రాయితీ కల్పించండి

చంద్రబాబుకు గాండ్ల, తెలికుల, దేవ తిలకుల జేఏసీ వినతి

భీమవరం టౌన్, మార్చి 24 : గాండ్ల, తెలికుల, దేవతిలకుల వృత్తిదారులు సమస్యలపై జేఏసీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. 'కుల వృత్తిదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. మర గానుగులకు 300 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ కల్పించాలి. రైతులు పండించిన నూనె గింజలు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి వృత్తిదారులకు తక్కువ ధరలకు విక్రయిస్తే అందుబాటు ధరలకు నూనెలు అందిస్తాం. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలు కులస్తులు తయారు చేసే నూనెలు కొనుగోలు చేసేలా చూడాలి. దేవాలయాలు పాలకమండళ్ళ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. సామాజిక భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల్లో స్థలాలు కేటాయించాలి' అని కోరారు. చంద్రబాబును కలిసిన వారిలో ఛైర్మన్ గ్రోసు సుబ్బారావు, వైస్ ఛైర్మన్ అడ్డా వీర వెంకటరాజు, సభ్యులు నరవ అనంతం, టీడీపీ రాష్ట్ర గాండ్ల సాధికారిక కన్వీనర్ చిత్రచేడు విశాలాక్షి, గొనివాని శ్రీనివాసులు తదితరులు ఉన్నట్లు కార్యదర్శి కాశిన సత్యనారాయణ భీమవరంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు ఎస్ఆర్‌కేఆర్‌కు మిజోరాం గవర్నర్ రాక

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 24 : ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 26న జరిగే వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారని కళాశాల సెక్రటరీ సాగి రామ కృష్ణ నిశాంత్‌వర్మ చెప్పారు. గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులకు ఆయా విభాగాలలో మెడల్స్ అందిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొనాలని కోరారు. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.



ఆచంట స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కులాలను కించపరుస్తూ పోస్టులు పెట్టొద్దు

శేషమ్మచెరువు యువకుడి అరెస్టు : డీఎస్పీ

ఆచంట, మార్చి 24: కులాలను కించపరుస్తూ పోస్టులు పెట్టి యువత జీవితం నాశనం చేసుకోవద్దని నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావు అన్నారు. ఆచంట పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచంట మండలం శేషమ్మచెరువుకు చెందిన పిల్లి సంతోష్ కుమార్‌ను అరెస్టు చేశా మన్నారు. ఇన్‌స్ట్రాగ్రామ్ తన అకౌంట్ నుంచి షెడ్యూలు కులంలో ఒక కులాన్ని కించపరుస్తూ వచ్చిన పోస్టును స్ర్కీన్ షాట్ తీసి వేరే గ్రూపులో షేర్ చేయడంతో వైరల్ అయ్యిందన్నారు.దీనిపై కోడేరు గ్రామానికి చెందిన సరిపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామన్నారు. ఎస్ఐ రాజశేఖర్, సీఐ కాశీ చరణ్ పాల్గొన్నారు

పోలీసు స్టేషన్‌పై దాడి కేసులో 55 మంది అరెస్టు

పెనుగొండ, మార్చి 24: ఇన్‌స్టా గ్రామ్‌లో అభ్యంతర మెసేజ్‌లు పెట్టి రెండు వర్గాల మధ్య అల్లర్లు సృషించడానికి కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న సమయంలో కొంత మంది యువకులు పెనుగొండ పోలీసుస్టేషన్‌పై దాడి చేసిన కేసులో సీసీ కెమేరాలు ఆధారంగా 55 మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసు స్టేషన్ కిటికీలు ధ్వంసం చేశారన్నారు. సీసీ కెమేరాల ఆధారంగా 22 మందిని గుర్తించామని వారిలో నలుగురిని ఏలూరు బాలురహోమ్‌కు తరలించామన్నారు. మిగతా 18 మందిని 22న అరెస్టు చేశామని ఇదే కేసులో 23న మరో 33 మందిని గుర్తించామన్నారు. వారిలో పది మందిని బాలురుగా గుర్తించి ఏలూరు బాలుర హోమ్‌కి తరలించి మిగిలిన 23 మందిని ఆదివారం అరెస్టు చేశామన్నారు. ఇప్పటి వరకు 55 మందిని అరెస్టు చేశామన్నారు. సీఐ నక్కా రజిని కుమార్, స్టేషన్ ఎస్ఐ షేక్ సుభాణి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విస్సాకోడేరులో అనుమానాస్పద మృతి



విస్సాకోడేరు చెరువు గట్టుపై మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాలకోడేరు, మార్చి 24 : విస్సాకోడేరు గ్రామంలోని మంచినీటి చెరువు గట్టుపై ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పాల కోడేరు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. తెల్ల బని యన్ జీన్ ఫ్యాంట్ వేసుకున్న వ్యక్తి రెండు రోజులుగా అదే ప్రాంతంలో చెరు వుగట్టుపై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడన్నారు. ఆదివారం సాయంత్రం గట్టుపై మృతి చెందాడని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఉంగరం వేలుకి రాగి ఉంగరంతో పాటు కుడి చేతిపై శ్రీజ, అనూష పేర్లతో పాటు త్రిశూలం పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

భీమవరం క్రైం, మార్చి 24 : భీమవరం రెండో పట్టణం కాశ్రేనిగుంటకు చెందిన షేక్ అల్తాఫ్ (27) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. ఇతనికి వివాహమైందని భార్య, భర్తలు విడిగా ఉంటున్నారు. మన స్తాపంతో ఈనెల 22న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడి నుంచి తణుకు, ఏలూరు ఆసుపత్రులలో వైద్యం చేశారని అనంతరం కాకినాడకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు.

రివర్స్‌లో లారీ..వెనుక ఉన్న కారుకు తప్పిన ప్రమాదం



ఆకివీడు, మార్చి 24: లారీ డ్రైవర్ నిర్లక్ష డ్రైవింగ్ కారణంతో వెనుక ఆగి ఉన్న చినకారు దెబ్బతింది. గణపవరం మండలంలోని చానమిల్లికి చెందిన కొంతమంది ఆదివారం కొల్లేరు పెద్దింట్లమ్మను దర్శించుకొని ఇంటికి తిరిగి వెళ్ళుతున్నారు. అయితే ఆకివీడు మెయిన్ సెంటర్‌లోకి వచ్చేసరికి ట్రాఫిక్‌గా ఉండడంతో లారీ వెనుక వారి కారును నిలుపుదల చేశారు.భీమవరం వైపు వెళుతున్న లారీ ఒక్కసారిగా వెనక్కి రావడంతో కారు ముందర భాగంగా లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో కారులోని జనం భయాందోళనతో కేకలు వేశారు. గట్టిగా కేకలు వేయడంతో ఆగడంతో ప్రమాదం తప్పింది. లారీ ఆపకుండా వెళ్లిపోతుండడంతో స్థానికులు అడ్డుకుని యజమానికి ఫోన్ చేసి రప్పించి మాట్లాడారు. కారు దెబ్బతినడంతో నష్టపరిహారం చెల్లించారు.

అనాథ అని చేరదీసి అన్నం పెట్టారు..

రూ.7.50 లక్షలు కొట్టేశాడు

ఆకివీడు, మార్చి 24: అనాధని చేరదీసిన కుర్రోడు తాళాలు పగలుకొట్టి నగదు కాజేసి పారిపోయాడని ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మందపాడుకు చెందిన రొయ్యల వ్యాపారులు దూదిగామ రాంబాబుకు, దుర్గాప్రసాద్‌లకు ఐదు రోజులు క్రితం కిరణ్ కుమార్ అనే పదహారేళ్ళ బాలుడు ఊరులో కనబడ్డాడు. తల్లిదండ్రులు లేరని ఆకలేస్తుందని చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లి అన్నం పెట్టారు. అప్పటి నుంచి రాంబాబు ఇంట్లోనే ఉంటూ దుర్గాప్రసాద్ ఇంటిలో భోజనం పెడుతున్నారు. శనివారం దుర్గాప్రసాద్, అతని భార్య ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. కిరణ్‌కుమార్ దుర్గాప్రసాద్ ఇంటి తాళాలు పగలుకొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.7.50 లక్షలు నగదు కాజేసి పరారయ్యాడు. ఆదివారం దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వివాహానికి వెళుతూ.. ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, మార్చి 24 :రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. మండలంలోని నాగులగూడెంకు చెందిన జంపన శ్రీనివాసరావు(30)ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం బుట్టాయగూడెం మండలం గంగవరంలో జరిగే వివాహ వేడుకలో పాల్గొనేందుకు బైక్‌పై బయల్దేరిన అతడు మార్గమధ్యలో స్థానిక పారిజాత గిరి నేషనల్ హైవే వద్ద కొయ్యలగూడెం నుంచి జీలుగుమిల్లి వైపు వెళ్లే ఐసర్ వ్యాన్ ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయమై ఘటన స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటన స్థలాన్ని ఎస్ఐ జ్యోతిబస్ పరిశీలించి కేసు నమోదు చేశారు.

రొయ్యల దొంగతనం.. ఏడుగురిపై కేసు నమోదు

ఆకివీడు, మార్చి 24: చెరువులో రొయ్యలు దొంగతనం చేస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.అప్పారావుపేటలో ఒక చెరువులో శనివారం రాత్రి ఏడుగురు కుర్రాళ్ల 40 కేజీల రొయ్యలు దొంగతనం చేస్తుండగా పట్టుకున్నారు. ఏడుగురులో నలుగురు (బాల కార్మికులు) ఉన్నారు. ఆదివారం యజమాని ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పెనుమదంలో పేకాట స్థావరంపై దాడి

పోడూరు, మార్చి, 24:పోడూరు మండలం పెనుమదం శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బంది దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7,900 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాచుగుంటలో ఆరుగురి అరెస్ట్ ..రూ.47 వేలు స్వాధీనం

ఉంగుటూరు,మార్చి 24 : ఉంగుటూరు మండలం నాచుగుంట శివారులో చేబ్రోలు పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.47,090 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 24 : వట్లూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంపై ఏలూరు త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో అతి వేగంగా కారు నడుపుతూ వచ్చి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాటరీ దొంగల ముఠా గుట్టు రట్టు

ఆగిరిపల్లి, మార్చి 24: ఆగిరిపల్లి మండలంలో సెల్‌ఫోన్ టవర్లకు ఉపయోగపడే బ్యాటరీల దొంగల గుట్టు రట్టు అయింది. హైస్కూల్ వద్ద ఆగిరి పల్లి ఎస్సై సురేంద్రబాబు నిర్వహించిన సాధారణ తనిఖీలో భాగంగా వాహ నాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో బ్యాటరీలు తీసుకువెళుతుండగా పోలీసులకు అనుమానం కలిగి ప్రశ్నించడంతో శుక్రవారం ఆగిరిపల్లి బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ వద్ద 18 బ్యాటరీలు దొంగిలించినట్లు, శనివారం వట్టిగుడిపాడు ఎయిర్‌టెల్ సెల్ టవర్ వద్ద నాలుగు బ్యాటరీలు దొంగిలించినట్లు నలుగురు నిందితులు ఒప్పుకున్నారు. దొంగిలించిన బ్యాటరీల విలువ రూ. 1.15 లక్షలు ఉంటుందని ఆగిరిపల్లి ఎస్సై సురేంద్రబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




పాలకొల్లు, ఉండిలలో ఈత మట్టలతో క్రైస్తవుల ర్యాలీ




కాళ్ళ, పెంటపాడులలో ర్యాలీ

క్రైస్తవుల మట్టల ఆదివారం

పాలకోడేరు, మార్చి 24: పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాలలో మట్టల ఆదివారాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా ఆదివారం నిర్వహించుకున్నారు. ఏసుప్రభువు ఎరుషలేము ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ప్రజలు రాజాధిరాజు ఏసుప్రభువును కీర్తిస్తూ స్వాగతిస్తూ దావీదు తనయ హోసన్న, యూదుల రాజా ఏసన్న అంటూ ప్రత్యేకంగా అలంకరించిన మట్టలతో ఊరేగిస్తారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు, శృంగవృక్షం, విస్సాకోడేరు, మైప, గరగపర్రు, కుముదువల్లి, గొరగనమూడి తదితర గ్రామాలలోని క్రైస్తవులు మట్టలతో ఊరేగించారు.

పాలకొల్లు అర్బన్: మట్టల ఆదివారం సందర్భంగా పట్టణంలోని క్రైస్తవులు ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. మట్టల ఆదివారం విశిష్టతను శంభుని పేట క్రీస్తు లూథరన్ చర్చి పాదర్ గూడపాటి రాజేష్‌కుమార్ వివరించారు. ర్యాలీ అనంతరం చర్చిలో జరిగిన కార్యక్రమంలో మట్టలాదివారపు విశిష్టతపై రాజేష్ కుమార్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

నరసాపురం టౌన్: లూథరన్, జీవన్‌జ్యోతి, కృపానివాస్, జీడీఎం, మండలంలోని సరిపల్లి, మల్లవరంలంక, కొప్పర్రు, రుస్తుంబాద, సీతారాంపురం, లక్ష్మణేశ్వరం, చిట్టవరం, గొంది తదితర గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారం నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు మట్టలను చేతపట్టుకుని వీధుల్లో తిరుగుతూ గీతాలు ఆలపించారు.

కాళ్ళ: ఉదయం నుంచి మట్టలకు పూలు అలంకరించి క్రైస్తవులంతా క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలో పెదఅమిరం, కాళ్ళ, బొండాడ, సీసలి, ఏలూరుపాడు, జువ్వలపాలెంతో పాటు ఆయా గ్రామాల చర్చిల్లో పాస్టర్‌లు, సీఆర్‌లు మట్టల ఆదివారం ప్రాముఖ్యతను తెలియజేశారు.

గణపవరం: క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రభావితం చేసే శ్రమదినాలను విశ్వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో చేపడతారు. ఆదివారం క్రైస్తవులు గణపవరం మండల గ్రామాల్లో మట్టలాదివారం నిర్వహించారు. గణపవరం పురవీధుల్లో క్రైస్తవులు పూలతో అలంకరించిన మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

పెంటపాడు: మండలంలోని వల్లూరుపల్లిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మల్లిపూడి జమాయమ్మ ఆధ్వర్యంలో సంఘస్తులు, చిన్నారులు ఈత మట్టలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మల్లిపూడి జాయ్‌బాబు పాల్గొన్నారు.

మొగల్తూరు: మండలంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు పాలపర్తివారిపేట లూథరన్ ప్యారిష్, కొండావారిపాలెం లూథరన్ ప్యారిష్, ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో పలు సంఘాల విశ్వాసులు ఈతమట్టలతో ప్రభువును ఊరేగిస్తూ క్రీస్తు బోధనలు వినిపించారు.

ఉండి: ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలోని ట్రినిటి లూథరన్ దేవాలయం వద్ద ఈత మట్ట ఆకులకు పువ్వులను తొడగి వాటితో పాటలను ఆలపిస్తూ ర్యాలీగా నడుచుకుంటూ ముందుకు సాగారు. ఉండి ప్రధాన సెంటర్‌లో కొద్దిసేపు నిలిచి పాటలను ఆలపించారు. మండలంలోని ఆయా చర్చిలలో మట్టలాదివారం పండుగను ఆచరించారు.

చాంబర్ అధ్యక్షుడిగా నరసింహారావు



పాలకొల్లు అర్బన్, మార్చి 24 : పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడిగా కారుమూరి వెంకట రత్న నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసింహారావు రెండవ చాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం ఛాంబర్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు.

టౌన్‌హాల్ కోశాధికారిగా శ్రీనివాసరావు



పాలకొల్లు రూరల్, మార్చి 24 : స్థానిక మామిడి చిన వెంకట శివయ్య మెమోరియల్ టౌన్‌హాల్ కోశాధికారి పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో యాదంరెడ్డి శ్రీనివాసరావు 77 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇదిలా ఉండగా అధ్యక్షుడిగా పోలిశెట్టి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మామిడి శివయ్య, కార్యదర్శిగా ముచ్చర్ల ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీగా జక్కంపూడి వెంకట రంగారావు, ఈసీ మెంబర్లుగా పంజా నరసింహారావు, చోడిశెట్టి లక్ష్మణ్‌కుమార్, తుమ్మిడి నాగభూషణం, ఎం.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది పీడీఎస్‌వీ బాలాజీ ప్రకటించారు.

చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణ



శిక్షణకు హాజరైన బాలలు

పాలకొల్లు అర్బన్, మార్చి 24 : పెయింటర్స్ సంఘ భవనంలో విద్యార్థులకు 11 ఆదివారాలు ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని అంతర్జాతీయ చిత్రకారుడు మార్లపూడి ఉదయ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వాకలపూడి అప్పారావు జ్ఞాపకార్థం ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు బాలబాలికలకు ఉచితంగా డ్రాయింగ్ టీచర్లుచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

నరసాపురం రూరల్, మార్చి 24: రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం చిట్టవరం గ్రామంలో అంజనా పుత్ర యువసేన ఆధ్వర్యంలో చిరు, పవన్ అభిమానులు మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకను పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 50 మంది అభిమానులు రక్తదానం చేశారు.

చండీ హోమం

పెనుగొండ, మార్చి 24: పాల్గొణ పౌర్ణమి సందర్భంగా శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్దని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దైవారాధన మించిన భక్తి మరొకటి లేదు

భీమవరం టౌన్, మార్చి 24 : దైవారాధన మించిన భక్తి మరొకటి లేదని, నేటి యువతలో దైవ భక్తి పెరిగిందని జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం శ్రీమావుళ్ళమ్మఅమ్మవారి పూరి గుడి దగ్గర అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధ్వజ స్తంభం పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేయించుకున్నారు. పూజలో కూర్చున్న దంపతులకు ఆశీర్వచానాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు(చినబాబు), నల్లం చిట్టిబాబు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగాలపై అవగాహన

భీమవరంటౌన్, మార్చి 24 : శారీరక వైద్యం వేరు మానసిక వైద్యం వేరని, అంతుపట్టని సమస్యలతో ఒత్తిడి తెచ్చుకుని మానసికంగా కుంగిపోవడం మానసిక రోగమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జీవి రమణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శాంతి నర్సింగ్ హోమ్‌లో మానసిక రోగాలు వాటి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రమణారావు మాట్లాడుతూ ఇటీవల యువత డ్రగ్స్ మద్యపానానికి బానిసలై మానసిక స్థితిని కోల్పోతున్నారని, అటువంటి వారు మానసిక వైద్య నిపు ణులను సంప్రదించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మానసిక ఆందోళనలు ప్రమాదకరమని, మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందన్నారు. కార్య క్రమంలో ఎస్ కే చాన్ భాషా, ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు..






వేడంగిపాలెంలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల.. భీమవరంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, తణుకులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి, తాడేపల్లిగూడెంలో సినీనటుడు సుమన్‌కు బొకే అందిస్తున్న కూటమి అభ్యర్థి బొలిశెట్టి, తదితరులు

జగన్ పాలనపై అన్నివర్గాల్లో వ్యతిరేకత: ఎమ్మెల్యే నిమ్మల

పోడూరు, మార్చి 24: జగన్ అరాచక, రాక్షస పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. వేడంగిపాలెం, కుమ్మరపాలెం గ్రామాల్లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికీ ఎన్నికల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అంధకారం చేసి అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే రామానాయుడు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలు, పేదల కోసం చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి రావూరి సుధ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ దూసనపూడి దొరబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మేడిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం వేడంగిపాలెంలో ఎమ్మెల్యే రామానాయుడు ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ పాదయాత్రలో గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే రామానాయుడు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

బొలిశెట్టిని గెలిపించుకోవాలి: సుమన్

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 24: కష్టాలలో ఉన్న వారికి సహాయం అందించే బొలిశెట్టి శ్రీనివాస్ లాంటి మంచి వ్యక్తిని తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించాలని సినీ నటుడు సుమన్ పిలుపు నిచ్చారు. ఆదివారం బొలిశెట్టిని ఆయన నివాసం వద్ద సుమన్ మర్యాదపూర్వకంగా కలవగా సుమన్‌ను బొలిశెట్టి సత్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రస్తుతానికి తాను రాజకీయాలకు దూరంగా ఉన్నానన్నారు. మంచి వ్యక్తులను పార్టీలకతీతంగా ఎన్నుకోవాలన్నారు. అనంతరం అభిమానులతో సెల్ఫీలు దిగారు. షేక్ బాజి, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఎక్కడ పట్టుబడినా ఏపీతోనే లింకు: ఆరిమిల్లి

తణుకు, మార్చి 24: దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా ఏపీతోనే లింకులు ఉంటున్నాయని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్ ఏపీ గాను, విశాఖను డ్రగ్ క్యాపిటల్‌గా చేసిన ఘనత జగన్‌దేనని ఆరోపించారు. సంధ్య పరిశ్రమకు చెందిన యజమాని వైసీపీ సీనియర్ నాయకుడు కూనం పూర్ణచంద్రరావుకు స్వయానా సోదరుడు కూనం వీరభద్రరావు అని వివరించారు. దీనిని బట్టి వైసీపీ నాయకులే బ్రెజిల్ నుంచి డ్రగ్స్‌ను సంధ్య ఆక్వా పేరుతో తెప్పిస్తున్నారని అర్థం అవుతుందన్నారు. వైసీపీ పాలనలో ఇసుక, బియ్యం మాఫియా చెలరేగిపోతున్నదన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవ రామకృష్ణ, గుబ్బల శ్రీనివాసు, కలగర వెంకట కృష్ణ, పితాని మోహన్, గోపిశెట్టి రామకృష్ణ, తోట సూర్యనారాయణ, నల్ల భాస్కరరావు, తాతపూడి మారుతీరావు, పాల్గొన్నారు.

నరసాపురంలో భారీ మెజార్టీ సాధించాలి



పవన్‌తో బొమ్మిడి, చాగంటి మురళీ

నరసాపురం టౌన్, మార్చి 24: గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయాం. ఈ సారి భారీ మెజార్టీ సాధించాలి, ఇందుకు పార్టీలో ఏమైనా చిన్న చిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టాలి, అంతా పార్టీ కోసం కలిసి పని చేయాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం అభ్యర్థి బొమ్మిడి నాయకర్, చాగంటి మురళీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నాయకర్ విజయానికి కష్టపడాలని మురళీని కోరారు. పార్టీకి మీరు చేస్తున్న సేవల్ని గుర్తించాం, అధికారంలోకి రాగానే మీకు సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

చేనేతకు అండగా టీడీపీ

తణుకు, మార్చి 24: చేనేత వృత్తిదారులకు టీడీపీ అండగా ఉందనే విషయాన్ని వారు గుర్తించాలని తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం వేల్పూరు తొమ్మిదో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పొక్కిరాల రంగారావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో చేనేత సోదరులు వైసీపీకి రాజీనామా చేసి ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆరిమిల్లి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అధికార పార్టీ నాయకుడు బీసీ అయినప్పటికి కేవలం బీసీ వర్గం అయినందున పొక్కిరాల రంగారావుని వైసీపీ వేధింపులకు గురిచేసిందన్నారు. టీడీపీ నాయకులు పితాని మోహన్, సప్పవరపు నాగేశ్వరరావు, విశ్వనాధం శ్రీను, రెడ్డి నరేంద్ర ప్రసాద్, రెడ్డి కేశవరావు, వల్లూరి మోహన్, రంగారావు, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

కూటమిని గెలిపించండి: తోట

భీమవరం అర్బన్, మార్చి 24: త్వరలో జరగనున్న ఎన్నికలలో మహాకుటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. భీమవరంలో పట్టణ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకురి సుబ్రహ్మణ్యంరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జనసేన పార్టీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఐక్యమత్యంతో పనిచేసి భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు సమన్వయంలో ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ళ నాగేశ్వరరావు, మెరగాని నారాయణమ్మ, వేండ్ర శ్రీనవాస్, మద్దుల రాము, కనకదుర్గ పాల్గొన్నారు

క్షయవ్యాధిపై అవగాహన

నరసాపురం టౌన్, మార్చి 24: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయవ్యాధి లక్షణాలు, వ్యాధి వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్ సుప్రియ అవగాహన కల్పించారు. క్షయ అంటు వ్యాధి అన్నారు. దగ్గు, జర్వం, కఫం పడటం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యుల్ని సంప్రదించి మందులు వాడాలన్నారు. ఆరు నెలలు మందులు వాడితే పూర్తిగా నివారణ చేయవచ్చునన్నారు.

గణపవరం: క్షయవ్యాధిగ్రస్థులకు ఆరునెలలు ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు గణపవరం ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయిలు తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి దినం సందర్భంగా ఆదివారం గణపవరంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిస్తే ఉచితంగా మందులిస్తామన్నారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఆరునెలలు మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయం అవు తుందని తెలిపారు.

శృంగవృక్షంలో కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ఠ

పాలకోడేరు, మార్చి 24 : శృంగవృక్షం గ్రామంలోని రావి చెరువు గట్టుపై నిర్మించిన సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యాక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్‌లు అందజేత

ఆకివీడు, మార్చి 24: ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు కరాటే ఎంతగానో అవసరమని డాక్టర్ బలరామ్ ప్రతాప్ కుమార్, యోగాసనాచార్య కందుల సత్యనారాయణ అన్నారు. స్థానిక పతాంజలి యోగాశ్రమంలో ఆదివారం మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ఘంటా శ్రీను, షైనీ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు రూరల్, మార్చి 24 : పాలకొల్లు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బిసురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు నిమిత్తం సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరాను బంగారువారిచెరువుగట్టు, బ్రాడీపేట బైపాస్‌రోడ్డు, కోడిగట్టు తదితర ప్రాంతాల్లో నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి స్నేహితుల సాయం



మొగల్తూరు, మార్చి 24: మొగల్తూరు పంచాయతీ పరిధి ఆదర్శనగర్ కాలనీకి చెందిన మారెళ్ళ గణపతి ఇటీవల రెండు కిడ్నీలు పాడవ్వడంతో డయాలసిస్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అతని బాల్య స్నేహితులు మొగల్తూరు ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ విద్యార్థుల నుంచి ఆర్థి సహాయాన్ని సేకరించారు. ఇలా సేకరించిన రూ.40,500 మొత్తాన్ని గణపతికి అందించారు. ఆబ్యాచ్ విద్యార్థులు రాము, సురేష్, గణేష్, పాము, శివకృష్ణ, త్రివిక్రమ్, కె.ప్రసాద్, ఎస్ శ్రీను, ఐ.రాజు పాల్గొన్నారు.

'ఆ ప్రైవేట్ కొరియర్‌తో ఆర్టీసీకి సంబంధంలేదు'

భీమవరం టౌన్, మార్చి 24 : పట్టణంలో ఒక ప్రైవేట్ కొరియర్ సర్వీసు ప్రారంభం చేస్తున్నట్లు ఒక కరపత్రం విడుదలైందని, అది ప్రైవేట్ కొరియర్ అని ఆర్టీసీకి సంబంధంలేదని డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. అది పూర్తిగా ప్రైవేట్ వారు నిర్వహించే కొరియర్ సర్వీస్ అవ్వడం వలన దానికి ఆర్.టి.సి వారికి ఏ విధమైన సంబంధం లేదని ముందుగా తెలుపుతున్నామని అన్నారు. నూరుశాతం అతి తక్కువ ఖర్చుతో సరుకు రవాణా చేసే ఏకైక సంస్థ ఆర్.టి.సి కార్గో కొరియర్ సర్వీస్ మీకు 24 గంటలు భీమవరం బస్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

రేపు చిన్నారుల ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం అర్బన్, మార్చి 24: ఈ నెల 26న బాలలకు ఉచిత గుండె వైద్య శిబిరం మెంటేవారి తోటలోని ఏబీఎస్‌వీకే వైద్య సహాయ కేంద్రంలో నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు 15సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. మరిని వివరాలకు 99490 93115కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు.

రాజీలేని పోరాటం యూటీఎఫ్ లక్ష్యం

వీరవాసరం, మార్చి 24:సమస్యలపై రాజీలేని పోరాటం చేయటం యూటీఎఫ్ లక్ష్యమని ఇదే లక్ష్యంతో అమరజీవి అప్పారీ వెంకటస్వామి పోరాటం చేశారని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జీవీపీ రామానుజరావు(గాంధీ) అన్నారు. ఆదివారం యూటీఎఫ్ భవనంలో అప్పారీ వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు జీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేశారు.

విజయలక్ష్మి మృతికి సంతాపం

భీమవరం టౌన్, మార్చి 24 : ఇన్నర్ వీల్ క్లబ్ సీనియర్ నాయకురాలు కంబాల విజయలక్ష్మి సంతాప సభను బ్యాంక్ కాలనీలోని ఆమె నివాసంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి మాట్లాడుతూ అందరికీ పెద్దదిక్కులా తలలో నాలుకలా ఉండే విజయలక్ష్మి మరణం తీరని లోటని అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గంధం శ్రీదేవి, కార్యదర్శి ఎస్.జయ శ్రీ, ఎస్.మణి, ఎస్.సాయి దుర్గాప్రసాద్, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



పాలకోడేరు, మార్చి 24 : ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భీమవరం డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి అన్నారు. ఆదివారం విస్సాకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాలలో పోలీస్ అధికారులు, సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

చైతన్యకు ఉత్తమ సేవా అవార్డు

తణుకు, మార్చి 24: తణుకు టీబీ యూనిట్ పరిధిలో ఉత్తమ సేవలందించినందుకు గాను టీబీ యూనిట్ ఎస్టీఎస్ (సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్) చైతన్యకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు చేతులు మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా భీమవరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా చైతన్యను పలువురు వైద్యులు, సిబ్బంది అభినందించారు.

కార్మిక రాజ్యం కోసం సీఐటీయూ పోరాటం

తణుకు, మార్చి 24: కార్మిక రాజ్యం కోసం సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం సీఐటీయూ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగుల శ్రమతో సంపద పెరుగుతున్నప్పటికీ వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. నాయకులు రాజా రామ్మోహన్‌రాయ్, పీవీ ప్రతాప్‌లు మాట్లాడారు. నాయకులు జేఎన్‌వీ గోపాలన్, యస్.వెంకటేశ్వరరావు, కర్రి నాగేశ్వరరావు, కల్యాణి, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, మార్చి 24: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంచార శకటం ద్వారా డాక్టర్ హాన్సీస్ అహ్మద్ వైద్యసేవలందించారు. తణుకు, సజ్జాపురం, పాతూరులో మంచానికే పరిమితమైన తొమ్మిది మందికి సేవలందించారు. పుట్టా వెంకట చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధన

ఉండి, మార్చి 24: అలుగులమ్మ 105వ జాతర ముగింపును పురస్కరించుకుని అఖండ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే శివ తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 24: పెన్షనర్లకు 11వ పీఆర్‌సీ, డీఆర్‌ఏ బకాయిలు త్వరగా చెల్లించాలని పెన్షనర్‌ల సంఘ అధ్యక్షుడు బి. హరికుమార్ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో జరిగిన పెన్షనర్ల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ రావడానికి ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున 30 శాతం తాత్కాలిక భృతి అందించాలని కోరారు. సంఘ కార్యదర్శి వీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షులు వి.విస్సంరాజు, వి. రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్స్ అందజేత

భీమవరం టౌన్, మార్చి 24 : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్‌ఆర్) లో భాగంగా, భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఇద్దరు పేద దివ్యాంగులకు వీల్ చైర్స్‌ను అందించామని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె.నాగ శయన రాజు తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు చేద్దాం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 24: అమరవీరుల త్యాగాలు మరువలేనివని వారి స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి దాన వరప్రసాద్ పేర్కొన్నారు. మోదుగగుంటలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

అర్ధవరంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



గణపవరం, మార్చి 24: అర్ధవరం శెట్టిబలిజపాలెంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆదివారం 9.52 గంటలకు సీతారాముల, ల క్ష్మణస్వామి, ఆంజనేయస్వామి, గణపతిస్వామి, కార్తికేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తుల రామనామ స్మరణతో వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం పండితులు నిర్వహించారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

పిప్పరలో ముగ్గరమ్మల జాతర

గణపవరం,మార్చి 24: పిప్పర గ్రామ ఇలవేల్పు అయిన ముగ్గురమ్మవార్ల జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాలక్ష్మమ్మ, మహంకాళమ్మ, బంగారుపాపమ్మ అమ్మవార్లు కొలువుతీరి ఉన్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతర తొలి రోజు ఆదివారం అమ్మవార్లకు సేవా కార్యక్రమం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. తెల్లవార్లు అమ్మవార్ల ఊరేగింపులో శక్తివేషాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్‌డప్పులు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు.

ఫాల్గుణ పౌర్ణమి పూజలు

ఆచంట, మార్చి 24: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆదివారం కొడమంచిలిలో ఉన్న దుర్గాదేవి పుట్టిల్లు అయిన పెదమల్లంలో గ్రామానికి చెందిన మిరియాల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు.

కోళ్ళపర్రులో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శివ

ఆకివీడు రూరల్ మార్చి 24 : కోళ్ళపర్ర గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగవైభవంగా జరిగింది. సుమారు 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఆలయాన్ని గ్రామస్థులు పునర్ని ర్మించారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నాయకులు ముత్యాల రత్నం, ముత్యాల ఉమాదేవి, మోటుపల్లిసాయి, గ్రామస్థులు కేశిరెడ్డి వెంకటే శ్వరరావు, యర్రా రవి, వాసు, కన్నబాబు, ఏడుకొండలు, గొడవర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో త్రిశూల, చక్రతీర్థ స్నానాలు



కేశవస్వామి, అమ్మవార్లకు అలంకరణ

పోడూరు, మార్చి 24: పోడూరు లో శ్రీమూలేశ్వరస్వామి, రాజేశ్వర స్వామి, కేశవస్వామి వార్ల పంచా హ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్లు, అమ్మ వార్లకు త్రిశూల స్నానాలు, చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు అమ్మవార్లను విశేషాలంకరణలు నిర్వహించారు. శ్రీపుష్పయాగోత్సవం వైభవోపేతంగా నిర్వ హించారు. కళ్యాణోత్సవాల్లో భాగంగా వివిద సాంస్కృతి కార్యక్రమాలను నిర్వ హించారు. సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, ఈవో తోట శ్రీనివాసరావు తెలిపారు.

వేణుగోపాలుడికి పుష్పయాగోత్సవం

వీరవాసరం, మార్చి 24: వీరవాసరంలోని రుక్మిణీ సత్యభామసహిత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి పుష్పయాగోత్సవాన్ని నిర్వహించారు. కళ్యాణోత్సవాల్లో వేడుకలలో భాగంగా ఆలయాన్ని పూలతో అలంకరించారు. పువ్వులు, పండ్లు, స్వీట్లు నివేదించి ఏకాంత సేవ చేశారు. ఉదయం నుంచి ఆలయంలో జరిగిన పూజలలో పూర్ణాహుతి , చక్రవారి వసంతోత్సవం నిర్వహించారు.

వాటర్ ట్యాంకులు.. చెత్తకు నిలయాలు

అడ్డాగా మార్చుకున్న మందుబాబులు



సంతబజార్ వద్ద ఉన్న వాటర్‌ట్యాంకుల వద్ద చెత్తగా పేరుకు పోయిన వాటర్‌బాటిళ్లు

పెంటపాడు, మార్చి 24: ప్రజలకు తాగు నీరందించి వారి దాహార్తిని తీర్చే వాటర్ ట్యాంకులు చెత్త కుప్పలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పెంటపాడు సంతబజార్ సమీపాన గల వాటర్ ట్యాంకుల వద్ద ప్రతి రోజూ గ్రామంలోని చెత్తకుప్పల నుంచి సేకరించిన వాటర్ బాటిళ్ల పడవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. రాత్రయితే చాలు ఈ ప్రాంతం మందు బాబులకు అడ్డాగా మారిపోతుంది. వీరు ప్రతి రోజూ వాటర్ ట్యాంక్ కింద కూర్చుని మద్యం సేవిస్తున్నా, పుంత రహదారి ట్యాంకు వాల్వ్ పాడైనా సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు

సమస్యపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. కేవలం తాను తెలుగుదేశం పార్టీకి చెందిన వాడినన్న అక్కసుతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పుంతరోడ్డు ట్యాంకు వాల్ పాడైపోవడంతో ఆ పరిధిలో ఆదివారం కుళాయి నీరుకూడా ఇవ్వలేదు.

- చినగోపిరెడ్డి, 13వ వార్డు సభ్యుడు